
# ఫెయిల్యూర్




''కుండపోతగా వర్షం కురుస్తోంది... హఠాత్తుగా ఆ చెట్టు క్రిందికి ఓ యువతి పరిగెత్తుకు వచ్చింది. అంతకుముందే అక్కడో పురుషాకారం చలికి వణుకుతూ నిలబడి ఉంది. ఆ యువతి ఉన్నవైపు పక్కకు దృష్టి మరల్చి చూసింది. ఆ యువకుడు ఆమెను చూడటం లేదు. ఆకాశాన్ని చీల్చుకుని వస్తున్న మెరుపు తీగల్ని చూస్తున్నాడు ...''

కలం ఆగిపోయింది. 'ప్రఖ్యాత' సినీ రచయిత (ప్రఖ్యాత అని ఎందుకన్నా నంటే, సినీ లోకంలో పనిచేసే ప్రతి చిన్న ఉద్యోగీ ప్రఖ్యాతి గడించాడే) ముకుందరావు కలం చేత్తో పట్టుకుని ఆలోచనలో పడ్డాడు. ఇంట్లోనుంచి పిల్లల అరుపులు, పక్కవాటాలోని భార్యాభర్తల కొట్లాటలు—ఇవేవీ అతని ఆలోచనల్ని భంగం చేయలేదుగానీ, అప్పుడే ఇంటికి వచ్చిన పెద్ద కొడుకు నెమ్మదిగా తల్లితో అంటున్న మాటలు అస్పష్టంగా అతని చెవిలో దూరాయి.

''ఇది కూడా పట్టేదే అమ్మా! అనంత మంత్రి గారి రికమెండేషన్ సిద్ధంగా ఉంది. మనం ఆశ వదులుకోనక్కరలేదు.''

తల్లి అంటోంది: ''ఏం చేస్తాం? మన ఖర్మ అట్లా ఉంది. నాన్నగారు చూడబోతే రాత్రీ, పగలూ ఆ కాగితాల్తో కుస్తీ పడుతూ ఉంటారు. అవి ఒరగబెట్టేదేమిటో తెలీదు.'' శ్యామల జాలిగా చూసింది అతని గదివైపు.

రాత్రి ఎనిమిది గంటలు దాటాక చిన్న పిల్లలకు భోంచేయ్యటం పెట్టడం ముగించి, వాళ్ళను పడుకోబెట్టి లోపలకు వచ్చింది. హాల్లో కుట్టుమిషను కూర్చున్న అక్క అడిగింది:

''ఇంటర్వ్యూ ఏమైంది అన్నా?''

శ్యామల తల అడ్డంగా ఊపింది. ఏమీ మాట్లాడకుండా లోపలకు నడిచింది.

''బి. ఏ. పాసయ్యింది. ఏం లాభం? తిరిగింది తిరిగినట్లే ఉంది.'' అక్క కంఠంలో అసహనం ధ్వనించింది. అప్పుడే కూర్చుని నెమ్మదిగా గొణుక్కుంటోంది పార్వతమ్మ. ముకుందరావు అన్నం కలుపుకుంటూ భార్య మాటలు శ్రద్ధగా వింటున్నాడు. అతనికే ఒక్క క్షణం గొంతులో అన్నం ముద్ద అడ్డుపడ్డట్లుగా అనిపించింది. ఆ మాటల్లో ఆవేదన కనిపించింది. రెప్పలు ఎత్తి భార్యవైపు చూశాడు. ఆమె కన్నీళ్ళు పెట్టుకున్నట్లు కనిపించింది. అన్నం గబగబా తిని లేచాడు.

''అయ్యో! ఏమిటా తొందర? అన్నం సగానికి పోయిందేం, ఏం తిన్నారని?'' ముకుందరావు ముఖంలో చూశాడు భార్యవంక.

ఇంతలోకే వచ్చిన పుస్తకాలతో బస్తీ పట్టుకున్న కొడుకుని చూశాడు. బి. ఏ. పరీక్ష పాసవ్వాలని వాడి తాపత్రయం.

ఎదిగొస్తున్న సంవత్సరాలు నిండకముందే ఇంటర్ పాసయ్యి కాలేజీలో చదివే వీలు లేక ఇంటి దగ్గరే ఉండి బి. ఏ. కి కట్టాలని వాడి ఆకాంక్ష. తన కళ్ళకి తనే చేతకాని అసమర్థుడిలా కనిపించాడు. వాడి తండ్రి సినీ రచయిత. కొడుకుని కాలేజీలో చదివించలేని, గుమ్మాలెక్కి ఎదిగిన కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చెయ్యలేని ''సినీ రచయిత'' చకచకా తన గదిలోకి నడిచాడు.

## సూర్యవనం

నేను వసంతాల్ని
చెట్ల మీదికి విసురుతున్నాను
చెట్ల వూపిరులు కోసి
నీ గుండె కుదురులో పోస్తున్నాను !
నేను కాలాన్ని —
రెప్పపాటులో జనన మరణాల్ని
సమంగా అనుభవించే కాలాన్ని —
శరీరానికి అటూ ఇటూ నిలిచి
లోకాన్ని బంతిలా చేసి
ఆడే ఇంద్రియ జాలాన్ని
సముద్రాల మీద నేను
ఒలకబోసుకున్న జ్ఞాపకాల వెన్నెల త్రాగి
ఇతిహాస శిల్పసుందరి
తెలవు లూరింది —
ఆ నిర్జీవ సౌందర్యాన్ని
మూల్యం చెల్లించి నువ్వనుభవిస్తున్నావు
నీకు వూపిరి దానం చేసిన
ఈ యదార్థ నిశ్వాసవృత్తపు చెట్లని
చూపులతో సరికేస్తున్నావు
అందుకే — నీ చిరునవ్వు మీదికి
నా క్షణాల సైన్యాలు
అగ్ని శూలాలు విసురుతున్నాయి
కాబట్టి
నీవు నుండి నీ కళ్ళని పెళ్ళగించి
ఇలా ఈ సూర్యవనంలో నాటు !

— ఆచార్య తిరుమల

ఎట్లాగయినా ఈ కథ పూర్తిచేసి వాళ్ళ కివ్వాలి. కనీసం పదివేలు తన కళ్ళ పడతాయి. పిక్చర్ హిట్ అయితే మరో అయిదు వేలు. మొత్తం పదిహేను వేలతో తన కష్టాలన్నీ తీరిపోతాయి. అప్పుడు శ్యామలకి ఉద్యోగం చేసే అవసరం ఉండదు. వకుళ ట్యూషన్ల చెప్పనక్కర్లేదు. రాము కాలేజీలో జాయిన్ అవుతాడు.

ముకుందరావు కాగితాలు ముందేసుకుని కూర్చు న్నాడు. పక్క వాటాలో పిల్లల్ని దావ బాదుతోంది తల్లి. పిల్లలు పెద్దగా రాగాలాపన ప్రారంభించారు. ఛీ...ఛీ...అర్ధరాత్రి అవుతున్నా ఈ గోలకి అంతూ పొంతూ ఉండదు. ఈ ఇల్లు మారిపోవాలి... చుట్టు పక్కల ఎవరూ లేనిచోట, తను రాసుకోవటానికి ఎట్టి ఇబ్బందీ లేకుండా ఉన్న స్థలం చూసి చిన్న ఇల్లు కట్టుకోవాలి ముందు డబ్బు రాగానే.' ముకుందరావు కలలు ఈ నాటివి కావు. అతను ఈ సినిమా జీవితం లోకి ఎప్పుడు వచ్చాడో అప్పట్నుంచే ప్రారంభించాడు కలలు కనటం. అతని కలలు కలలుగానే ఉండిపో తున్నాయి. ఏ రెండేళ్ళకోగానీ పిక్చరు రిలీజవదు. దానికి డబ్బు వస్తే రచయితని ఒక చూపు చూస్తారు. అందులో ఎన్ని గొడవలు. నిర్మాతలు వెనకా ముందాడ తారు. "పొందలేమయ్యా, సినిమా ఆడదీ" అంటారు డైరెక్టర్లు. అంతా అయినాక ఇన్‌కమ్ టాక్స్ వాళ్ళు పిక్చర్ ఫెయిలయిందో ఇక చెప్పే పని లేదు.

ముకుందరావు ఆలోచనలు కట్టిపెట్టి రాయ సాగాడు.

"చెట్టు కింద ఉన్న పురుషాకారం ఆ యువ తిని చూసింది. బొంగురు గొంతుకతో, "మీ ఇల్లెక్కడ?" అడిగింది.

ఆ యువతి దూరంగా చూపించింది చేత్తో.

ఆ యువకుడు నిట్టూర్చాడు.

వాన తగ్గింది. ఆమె బయల్దేరింది.

"మా కో ఇల్లంటూ ఉన్నది" అన్నాడు మేఘా వృతమై ఉన్న ఆకాశంలోకి చూస్తూ.

అతణ్ణి వదిలి వెళ్ళ బుద్ధి కాలేదు ఆమెకు.

"ఈ రాత్రికి మా ఇంటికి రండి—పొద్దున్నే వెళ్ళిపోదురుగాని."

"మీ ఇంట్లో వాళ్ళు..."

"నాన్న ఏమీ అనుకోరు. తమ్ముడూ, చెల్లాయీ ఉన్నారు" అన్నది, అమ్మ మాత్రమే లేదు అన్న అర్థం స్ఫురించేలా.

". . . . . ."

తెలతెలవారుతోంది ...

ముకుందరావు కథ రాయటం ఆపి ఒక్క సారి ఆవలించాడు.

గబగబా బట్టలు వేసుకుని బయలుదేరుతున్న శ్యామల ఉదయమే వెళ్ళిన నాన్న గారు తిరిగి వెంటనే రావటం గమనించింది. ముకుందరావు కాళ్ళీడ్చు కుంటూ లోపలకు వచ్చాడు.

శ్యామల బయటకు వెళ్ళిపోయింది.

ఆ రాత్రి ముకుంద రావు కాగితాల కట్ట ముందు పెట్టుకుని కూర్చున్నాడు.

పక్కనే చించి గుట్టగా పోసిన కాగితం ముక్కల్ని చూశాడు ... కథ మార్చి రాయాలి.

గబగబా రాయటం మొదలెట్టాడు.

"అది నిశీథ సమయం. దూరంగా కుక్కల అరుపులు మినహా మరే శబ్దమూ లేదు. ఆ నిశీథివేళ ఒక యువతి వగర్చుకుంటూ పరిగెత్తుతోంది. వెనక రౌడీలు తరుముతున్నారు. ఆమె అలిసి పోయి ఒక ఇంటి తలుపు కొట్టసాగింది. ఘూర్కా "కౌన్ హై" అని ప్రశ్నించాడు.

ఈ గోలకి ఇంటి ఆసామీ తలుపు తెరిచి బయటకు వచ్చాడు.

'ఎవరు మీరు?'

ఆమె తన పేరు చెప్పి దూరాన రౌడీలు తరుము తున్నారని, ఈ రాత్రికి ఆశ్రయం ఇమ్మని ప్రార్థిం చింది ... కథ సాగి పోయింది. ఆ రాత్రికేగాదు, ఆమె జీవితానికే భరోసా ఇచ్చాడు.

ఆమె చెప్పిన దయనీయమైన గాథ విని జాలితో ఆమెకు తన ఆఫీసులోనే ఉద్యోగం ఇచ్చాడు. ఆ జాలి ప్రేమగా మారటానికి ఎంతో కాలం పట్టలేదు."

ముకుందరావు తను రాసిన కాగితాలు తిరిగి చదువుకుని నీరసంగా నవ్వుకున్నాడు.

ఆ సాయంత్రం వస్తూనే సంతోషంగా చెప్పింది శ్యామల, "నాకు ఉద్యోగం వచ్చిందమ్మా!" అంటూ. తల్లి తమ కష్టాలు గట్టెక్కాయని తృప్తి పడింది. వకుళ తనూ, అక్కా ఇద్దరూ కలిసి సంపాదిస్తున్నట్టు వూహించుకుంది. రాము సంతోషంగా చూశాడు అక్క మొహంలోకి— తన చదువుకి ఎట్టి ఇబ్బందీ లేదు.

ముకుందరావు నిర్వికారంగా చూశాడు అందరి వంకా. ముకుందరావు రాస్తూనే ఉన్నాడు పగలూ, రాత్రీ కూర్చుని. రాత్రి పొద్దుపోయి పడుకున్న ముకుందరావు తెల్లారి ఆలస్యంగా లేచి సావిట్లో జరుగుతున్న గొడవ ఆసక్తిగా వినసాగాడు.

ఆఫీసుకు వెళ్ళటానికి తయారవుతున్న శ్యామల పాలవాడిని సమాధాన పరచడానికి ప్రయత్నిస్తోంది. వకుళ ట్యూషను పిల్లలు ఇవ్వాల్సిన డబ్బు ఇంకా ఇవ్వలేదు. అందుకే పాలవాడు, పనిమనిషి, చాకలి బారులుతీరి కూర్చున్నారు.

శ్యామల ఎలాగో వారిని మెల్లిగా పరిచి బయటకు పంపేసి లోపలకు వచ్చేసరికి తల్లి కన్నీళ్ళు పెట్టు కోవటం కనబడింది.

"అదేమిటమ్మా! కంట తడిపెడుతున్నావా? వచ్చే నెలనుంచీ నాకూ జీతం వస్తుందిగా! అప్పుడే ఇబ్బందీ ఉండదు" అని తన చెమ్మగిల్లిన కళ్ళు తల్లి కంట పడకుండా చప్పున బయటకు వచ్చేసింది.

ముకుందరావు నిస్సహాయుడిలా మంచం దిగ కుండా అలాగే పడుకున్నాడు.

శ్యామల ఆలోచిస్తూ నడుస్తోంది. నాన్నగారు ఇదిగాక మరెందులో కయినా దిగి ఉంటే బాగా రాణించే వారు అనుకుంటోంది మనసులో ... ఆయన కథలో రాసిన సంఘటనలు చాలా రమ్యంగా ఉన్నాయి. ఆ యువతిని ప్రేమిస్తాడు బాస్ ... అతడికి అడ్డు చెప్పే వాళ్ళుండరు. అతనిదే ఇష్ట రాజ్యం. కొంతకాలం కలిసి తిరుగుతారు. చూపులతో ప్రారంభమైన వారి ప్రణయం క్రమంగా తీగలల్లు కుని చిగిర్చి పూలు పూస్తుంది. ఆమెకి ఎవరూ లేరు. అనామకురాలు. అతను పెద్ద స్టేటస్ కలవాడు. అయినా ఆమె అతనికి తటస్థపడిన తరుణం అటు వంటిది ... ఠెళ్ళున ఎవరో కొట్టినట్టు ఉలిక్కి పడింది శ్యామల. అది సినిమా కథ. జీవితం కాదు. శ్యామల త్వరగా నడిచి బస్‌స్టాండ్ చేరుకుంది.

ఆఫీసులో టైపు మిషన్ల చప్పుడు శ్యామల చేతివేళ్ళు వేగంగా కదులుతున్నాయి. ఆమె మనోవీధిలో తండ్రి రాసిన కథలోని హీరో అస్పష్టంగా కనపడి మాయమవుతున్నాడు. ఆలోచనలో పడి తప్పులు కొట్టింది.

కొద్ది సేపటికి ప్యూన్ వచ్చి, "మిమ్మల్ని రమ్మం టున్నారు" అన్నాడు.

శ్యామల మెల్లిగా నడిచింది మేనేజర్ గదిలోకి.

"మిస్ శ్యామలా, వాటీజ్ దిస్?"

శ్యామల కళ్ళెత్తి చూట్టానికి భయపడింది.

"చెప్పండి—పని చెయ్య దల్చుకున్నారా, లేదా?"

శ్యామల జవాబు చెప్పలేనట్టు తల దించుకుంది.

"మళ్ళీ టైపు చేసి తీసుకురండి."

శ్యామల కాగితాలు అందుకుంటూ అప్రయ త్నంగా అతని వంక చూసింది.

మేనేజర్ అందగాడే! అయితే ఉత్త కోపిష్టిలా ఉన్నాడు ... శ్యామల చూపు తిప్పుకుని చకచకా బయటకు నడిచింది.

తండ్రి భోజనం చేస్తున్న సమయంలో శ్యామల

కాగితాలు తీసి చదవసాగింది.

"బాస్ ఉత్త కోపిష్టి, అయితేనేం! వెన్నలాంటి మనసు" అనుకుంటోంది ఆ అందాల హీరోయిన్ పార్కులో ఒంటరిగా కూర్చుని సాయంత్రం హాయిగా చివాట్లు తిన్న స్టైనో తన చిరునవ్వు చూసి పెసరట్టులా మాడ్చుకున్న మొహాన్ని గుర్తు తెచ్చుకుంది. కానీ తనను చూసి ఎంత అందంగా నవ్వాడనుకుంది.

పార్కులోకి కారు వచ్చి పక్కగా ఆగింది.

ఆ అందగాడు దిగాడు, చిరునవ్వులతో.

'హలో, డార్లింగ్...హౌ ఆర్ యు?' ఆమె పక్కనే చతికిలబడ్డాడు అనుకుని కూర్చున్నట్టుగా కూర్చుని.

శ్యామల కాగితాలు యథాస్థానంలో పెట్టేసి బయటకు నడిచింది.

కలల్లో జరిగే సంఘటనలే సినిమాల్లో చూస్తాము ... సినిమా ఒక అందమైన కల...

శ్యామల పక్క సరి చేసుకుని పడుకుంది.

ఆమె కలల్లో ఆఫీస్ మేనేజర్, తనూ పక్క పక్కన పార్కులో విహరిస్తున్నట్టు, పండు వెన్నెల్లో చేయి చేయి కలుపుకుని షికార్లు చేస్తున్నట్టు...

ముకుందరావు కథ పూర్తి చేశాడు. మీటింగ్ మొదలైంది. శ్యామల రోజూ ఆఫీసుకు వెళ్తునే ఉంది. ఊహాలోకంలో విహరిస్తూనే ఉంది. సరికొత్త కారులో బాస్ పక్కన కూర్చుంటూనే ఉంది. ఇంట్లో తల్లి సుస్తీగానీ, తండ్రి ఇల్లు పట్టకుండా సినిమా వాళ్ళతో తిరగటం గానీ, వకుళ ఉద్యోగ ప్రయత్నాలు ఒక వంక చేస్తూ, మరో పక్క తిరిగినన్ని ఎక్కువ ప్రయివేట్లు కుదుర్చుకోటం గానీ ఇవేవీ ఆమె ఊహల్లో చోటు చేసుకోలేక పోయాయి.

అందమైన రంగు రంగుల ప్రపంచం. అందులో మేనేజర్, తనూ ... ఇద్దరే! ఇంకెవరూ లేరు.

రోజులు గడిచిపోతూనే ఉన్నాయి.

ఒక రోజు పని ఎక్కువగా ఉండి చీకటి పడే వరకూ ఉండి పోయింది ఆఫీసులో శ్యామల.

"ఇవాళకి ఆపేయండి. ఇక వెళ్ళిపొండి." ఆఫీసర్ శ్యామల వంక చూస్తూ అన్నాడు.

శ్యామల లేచి నిలబడింది, కాగితాలు సర్ది.

అతను తనవంకే చూడటం శ్యామల గమనించ లేదు.

ఇద్దరూ బయటకు వచ్చారు.

అతను కారు బయటకు తీస్తూ, "నా కారులో దింపేస్తాను రండి" అన్నాడు చిరునవ్వుతో చూస్తూ.

శ్యామల సందేహిస్తూ నిలబడింది. తన కలలు ఫలించే రోజు ఇదేనా? ... ఆమె హృదయం ఉప్పొంగి పోతోంది.

"ఫర్వాలేదు, రండి."

శ్యామల కారువేపు నడిచింది. కారులో కూర్చోవటం ఆమెకు అదే మొదటిసారి. ముందు అద్దంలోంచి బయటకు చూస్తూ కూచుంది. అతను ఏదో మాట్లాడుతున్నాడు. ఆమె అదేం వినిపించుకోవటం లేదు. ఆమె ఊహిస్తున్న సుందర స్వప్నం కళ్ళముందు సజీవంగా నిలబడ్డట్టు తోచింది.

కారు ఎటు పోతోందో కూడా గమనించే స్థితిలో లేదామె.

హఠాత్తుగా కారు ఆగింది. శ్యామల పరిసరాలు గమనించింది. బయట చాలా చీకటిగా ఉంది. శ్యామల భయపడింది. "ఇక్కడెందుకు ఆపారు?"

అతను చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వులో అందాలు గమనించే స్థితిలో లేదామె. తన పరిస్థితి మాత్రం స్పష్టంగా తెలుస్తోంది.

కారు దిగింది. అతనూ దిగాడు.

అయోమయంగా నిలబడ్డ శ్యామలకి అతి దగ్గరగా నిలబడి ఆమె కళ్ళల్లోకి చూస్తూ తీయగా నవ్వాడు. ఆ తీయదనం అనుభవించే స్థితిలో లేదు శ్యామల.

"ఇక్కడికెందుకు తీసుకు వచ్చారు?"

"ఎందుకో ఇంకా తెలీలేదా?" ఆమెకు సమీపంగా వచ్చాడు.

శ్యామలకి అర్థమైంది ... తన జీవితం ఏమలుపు తిరుగుతోందో అతను చెప్పకుండానే గ్రహించుకుంది.

ఆమె వారించేలోపలే అతనామెను కార్లోకి తోసి తెచ్చాడు. తన చేతిలో ఏమీ లేదనీ, అంతా మించి పోయిందనీ వెంటనే తెలుసుకుంది ఆమె.

రాత్రి చాలా పొద్దు పోయాక ఇంటికి చేరుకుంది శ్యామ. తర్వాత పావు గంటకి ముకుందరావు ఇల్లు చేరాడు. అతని మొహం వాడిపోయింది. జీవితంలో ఓడిపోయిన వాడిలా నీరసంగా కుర్చీలో కూలబడ్డాడు. మరేం లేదు. అతని పిక్చరు ఫెయిలయి పోయింది. రిక్త హస్తాలతో ఇల్లు చేరాడు.

చిన్నగా ఏడుపు వినబడి సావిట్లోకి వచ్చాడు.

శ్యామల మొహం చేతుల్లో దాచుకుని కుమిలి కుమిలి ఏడుస్తోంది... జీవితంలో తన విలువ తెలుసుకోలేని శ్యామల ప్రస్తుతానికి కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది. తన జీవితమే ఫెయిల్యూర్ అయిందని గుండె బద్దలయేలా ఏడుస్తోంది... ★



గొబ్బెమ్మల సింగారం

చిత్రం — టి. ఎస్. పి. అంజనేయులు